

ఘట్‌కేసర్ రూరల్ : ప్రతాపసింగారంలోని దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యా



శామీర్‌పేట: కొల్తూర్‌లో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి

# ప్రజాపాలనకు విశేష స్పందన

**మున్సిపాలిటీల్లో 20,668**
**గ్రామాల్లో 1535 దరఖాస్తులు**

**మేడ్చల్ జోన్ బృందం, జనవరి 2:** ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం నియోజకవర్గంలోని ఐదు మండలాలు, మూడు కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీల్లో దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్లు పర్యవేక్షించారు. పీర్జాదిగూడ మున్సిపల్ పరిధి పర్వతాపూర్, ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారం గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి, ప్రజలు ఇబ్బందుల పడకుండా చూ డాలని అధికారులకు సూచించారు. మూడుచింతలపల్లి మండలం కొల్తూర్, నారాయణపూర్ గ్రామాలను అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి సందర్శించి, దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలు, కీసర మండలంలో నిర్వహించిన ప్రజాపాలనలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు చంద్రారెడ్డి, వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్, కమిషనర్లు రాజేందర్‌కుమార్, రాజమల్లయ్య, మేనేజర్లు చంద్రశేఖర్, వెంకటేశం, డీఈలు రఘు, చిరంజీవులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు,. సర్పంచులు, ఎంపీటీసీలు. అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలో చైర్మన్‌లు ముల్లి పావనీ జంగయ్య యాదవ్, కొండల్‌రెడ్డి పర్యవేక్షించారు. మేడ్చల్ మండలంలోని లింగాపూర్, కోనాయిపల్లి,రాజబొల్లారం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంపీడీవో పద్మావతి, తహసీల్దార్ శైలజ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీసంజీవ, శేఖర్, ఏవో అర్చన, డీటీ దిలీప్‌పాల్గొన్నారు. మండల పరిధి ప్రతాపసింగారంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని మేడ్చల్ జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, సర్పంచ్‌లు శివకుమార్, ఉప సర్పంచ్ అబేదాబేగం, కుమార్ తదితరులు పాల్గొన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రజాపాలన కేంద్రాలను సిబ్బందితో కలిసి కమిషనర్ రామలింగం పరిశీలించారు.

| మున్సిపాలిటీ | వచ్చిన దరఖాస్తు |
|---|---|
| మేడ్చల్ | 1526 |
| గుండ్లపోచంపల్లి | 438 |
| తూంకుంట | 235 |
| నాగారం | 1536 |
| దమ్మాయిగూడ | 1587 |
| ఘట్‌కేసర్ | 875 |
| పోచారం | 1189 |
| జహర్‌నగర్ | 3157 |
| పీర్జాదిగూడ | 2059 |
| బోడుప్పల్ | 2862 |
| **మొత్తం** | **20,668** |
| **మండలం** | **దరఖాస్తులు** |
| మేడ్చల్ | 193 |
| శామీర్‌పేట | 108 |
| మూడుచింతలపల్లి | 206 |
| ఘట్‌కేసర్ | 723 |
| కీసర | 305 |
| **మొత్తం** | **1535** |

## వరంగల్ హైవేపై అండర్ పాస్‌లు నిర్మిస్తాం..

### నిర్మాణ స్థలాలను పరిశీలించిన ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

**ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్, జనవరి 4:**వరంగల్ జాతీయ రహదారిపై అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణాలను వెంటనే ప్రారంభించనున్నట్లు రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. పోచారం,ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధితో పాటు మండల పరిధిలోని అవుషాపూర్, అంకుషాపూర్‌లో నిర్మించనున్న అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణ స్థలాలను ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డిలు మంగళవారం పరిశీలించారు. ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అభ్యర్థన మేరకు కేంద్ర రోడ్డు రహదారుల శాఖ మంత్రి నితిన్ గట్కరి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే మంజూరు ఇచ్చినట్లు చెప్పారు. వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ వెంట పోచారం చైర్మన్ బి.కొండల్‌రెడ్డి,వైస్ చైర్మన్ రెడ్యానాయక్,బీజేపీ కౌన్సిలర్ మహేశ్,బీజేపీ నాయకులు నానావత్ బిక్కూనాథ్ నాయక్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి,కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు,అవుషాపూర్ సర్పంచ్ కావేరి, ఎంపీటీసీ శోభారాణి, మండల బీజేపీ అధ్యక్షుడు ప్రవీణ్ రావు, నాయకులు మశ్చేందర్ రెడ్డి, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.



అవుషాపూర్‌లో అండర్ పాస్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి తదితరులు



**కిక్కిరిసిన పెట్రోల్ బంక్‌లు**

మేడ్చల్ : మోటార్ వాహనాల చట్ట సవరణను నిరసిస్తూ ఆయిల్ ట్యాంకర్ల యాజమానులు ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళ వారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంక్‌లు కిక్కిరిసిపోయాయి.



### సీఎంను కలిసిన జడ్పీ చైర్మన్,మాజీ ఎమ్మెల్యే

**ఘట్‌కేసర్ రూరల్/ఘట్‌కేసర్:** సీఎం రేవంత్‌రెడ్డిని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

**శామీర్‌పేట, జనవరి 2:** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో జరిగింది.పోలీసుల కథనం ప్రకారం...శామీర్‌పేట మండలం కొల్తూర్ గ్రామానికి చెందిన పులికంటి సంజీవ (37) శామీర్‌పేటలోని ఓ ఎంటర్‌ప్రైజెస్ కాంట్రాక్టు సంస్థలో పని చేస్తున్నాడు. సోమవారం ఆయన శామీర్‌పేటలో విధులు ముగించుకొని, తిరిగి గ్రామానికి వెళ్తుండగా గ్రామ సమీపంలోని స్వామి వివేకానంద విగ్రహం దగ్గర కొల్తూర్ నుంచి ఎదురుగావస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో సంజీవ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### చెత్త వాహనం బైక్‌ను ఢీకొని..

**పీర్జాదిగూడ:** చెత్త ఆటో వేగంగా, బైకును ఢీ కొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిగా, మరొకరికి గాయాలైన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిదిలో చోట చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం ...నగరంలోని నాచారానికి చెందిన లొంపి బాబి(32) స్థానికంగా ఓ ఫార్మసీలో పని చేస్తున్నాడు. మంగళవారం తన బైక్‌పై భార్య రోజాతో కలిసి మేడిపల్లి వైపు వెళ్తుండగా చెంగిచర్ల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న చెత్త వాహనం వేగంగా వచ్చి వీరు ప్రయాణిస్తున్న బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాబికి తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. భార్యకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని గాంధీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### గుర్తు తెలియని వాహనంఢీకొని...

**ఘట్‌కేసర్ రూరల్:** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యాచకుడు మృతి చెందిన సంఘటన పోచారం ఐటీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోచారం ఐటీసీ ఎస్సై శివకృష్ణ కథనం ప్రకారం.. వరంగల్ జాతీ య రహదారి అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తా వద్ద ఆదివారం మధ్యాహ్నం రోడ్డు దాటుతున్న ఓ యాచకున్ని (40) ఘట్‌కేసర్ నుంచి ఉప్పల్ వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన యాచకున్ని చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డబుల్ ఇండ్ల సముదాయంలో వసతులు కల్పించాలి

**ఘట్‌కేసర్,జనవరి2:** ఘట్‌కేసర్‌లోని డబుల్ ఇండ్ల సముదాయంలో మౌలిక వసతులు కల్పించాలని,వీధికుక్కలను నియంత్రించాలని కాంగ్రెస్ నాయకులు,మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు కె.మల్లేశ్, రవీందర్,నాయకులు యాదవ్,శ్రీనివాస్ గౌడ్,దేవేందర్ తదతరులు మున్సిపాలిటీ కమిషనర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అంతకుముందు వారుఘట్‌కేసర్‌లోని మైసమ్మ గుట్ట వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్పందించిన కమిషనర్ సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

## అయోధ్యరాముడి అక్షింతల పంపిణీ

**ఘట్‌కేసర్ రూరల్,జనవరి2:** మండల పరిధి అవుషాపూర్‌లో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమానికి విశేషస్పందన లభించింది. అవుషాపూర్ గ్రామంలోని శివాలయంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ కావేరి మశ్చేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్ర మంలో నాయకులు ప్రసాద్‌జీ, మల్లారెడ్డి, సదానందరెడ్డి, రాఘురాంరెడ్డి, సందీప్, అరవింద్, వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యం

**జవహర్‌నగర్, జనవరి 2:** బాలిక అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం కథనం ప్రకారం... జవహర్‌నగర్‌లోని మల్లికార్జున్‌నగర్‌లో నాయుడు నగేశ్, భార్య కాశీ, ముగ్గురు పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. 7వ తరగతి వరకు చదివిన భవాని(17) తల్లితో కలిసి ఇండ్లల్లో పనిచేయడానికి వెళ్లేది. ఈనెల 1న పని చేయడానికి వెళ్లిన తల్లికూతర్లు పక్కపక్కనే ఇండ్లల్లోనే పని చేస్తున్నారు. ఈ క్రమంలో పని పూర్తయిన తరువాత భవాని ఎంతకు రాకపోవడంతో ఇంటి యజమానిని భవాని గురించి వాకాబు చేయగా గుర్తు తెలియని వ్యక్తికి ఫోన్‌చేస్తే అతనితో వెళ్లిందని చెప్పాడు. ఆమె ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 21న ఘట్‌కేసర్ ఘట్‌మైసమ్మ జాతర

**ఘట్‌కేసర్,జనవరి2:** ఈనెల 21న ఘట్‌కేసర్ ఘట్‌మైసమ్మ దేవత జాతర నిర్వహణకు గ్రామస్తులు నిర్ణయించారు. మంగళవారం ఆలయం వద్ద ఈఓ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్,గ్రామస్తులు,ధర్మకర్తల ఆధ్వర్యంలో ఆలయ జాతర నిర్వహణ సమావేశం జరిగింది. ఈనెల 21న జాతర నిర్వహించాలని నిర్ణయించారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవ రెడ్డి, నాయకుడు దాసు గౌడ్,కౌన్సిలర్లు,ఆలయ ధర్మకర్తలు,భక్తులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా బి.హరిశంకర్

**ఘట్‌కేసర్,జనవరి2:** ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ప్రధాన కార్యాదర్శిగా బి.హరిశంకర్‌ను నియమించినట్లు అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ మంగవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదేశానుసారం పార్టీలో కొంత కాలంగా పనిచేస్తున్న హరిశంకర్‌ను నియమించినట్లు వారు పేర్కొన్నారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ..

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 2:** తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన పోచారం ఐటీసీ పోలీస్ స్టేషన్ పరిధి నారపల్లిలో జరిగింది. పోచారం ఐటీసీ ఇన్‌స్పెక్టర్ వి.అశోక్ రెడ్డి కథనం ప్రకారం...పోచారం మున్సిపాలిటీ నారపల్లిలోని లక్ష్మీనగర్‌కు చెందిన హృదయకాంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 30న నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీకి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి డోర్ తెరిచి ఉంది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని తులంన్నర బంగారు నగలు, రూ.50 నగదు కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఘట్‌కేసర్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అశోక్‌కుమార్

**ఘట్‌కేసర్ రూరల్:** ఘట్‌కేసర్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఎం.అశోక్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్క విధులు నిర్వహించిన జి.కృష్ణ మల్కాజిగిరి తహసీల్దార్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో కీసర తహసీల్దార్ ఎం.అశోక్ కుమార్ బాధ్యతలు చేపట్టారు.

## బిల్లులు చెల్లించాలని జీపీ ఎదుట కాంట్రాక్టర్ ధర్నా

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 02:** పంచాయతీ నుంచి రావాల్సిన బిల్లులు చెల్లించాలంటూ ఓ కాంట్రాక్టర్ దంపతులు పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నాకు దిగారు. మండల పరిధి ఎదులాబాద్ గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ బండి హనుమంతు పంచాయతీకి సరఫరా చేసిన బ్లీచింగ్ ఫౌడర్, చీపుర్లకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భార్య కృష్ణవేణితో కలిసి పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. వెంటనే తమకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.